
సాక్షి
నల్లగొండ
శనివారం । 17 । ఆగస్టు । 2024



దొంగల ముఠా అరెస్ట్
సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఆరుగురు దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590 అడుగులు
ఇన్‌ఫ్లో	: 79,535 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 79,535 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,150 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 7,518 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.33 అడుగులు
ఇన్‌ఫ్లో	: 662 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 576.38 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 258.39 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 258.30 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు అగ్రీ షో



ఎన్జీ కళాశాల ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో రైతుబడి అగ్రీషో శనివారం ప్రారంభం కానుంది. శని, ఆదివారాలలో నిర్వహించే అగ్రీషోను రాష్ట్ర వ్యవసాయశాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీల సరఫరా

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలు, స్వీట్లను దూర ప్రాంతాల్లో ఉన్న తోబుట్టువులు పంపవచ్చునని ఆర్టీసీ ఆర్‌ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం బస్‌స్టేషన్లలో ఏర్పాటు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్స్‌టైల్స్ డిప్లొమా ప్రవేశాలపై అవగాహన

నల్లగొండ రూరల్ : చేనేత, టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా చేనేత సహాయ సంచాలకుడు ద్వారక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి.. పదో తరగతి ఉత్తీర్ణులైన 25 ఏళ్లలోపు అభ్యర్థులు ఈనెల 31లోపు జిల్లా చేనేత కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నేడు ఓపీ వైద్య సేవలు బంద్

నల్లగొండ టౌన్ : కోల్‌కతాలో ఈ నెల 2న డాక్టర్‌పై జరిగిన పాశవిక హత్యాఖాండను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలను బంద్ చేస్తున్నట్లు నీలగిరి ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, కార్యదర్శి డాక్టర్ రమేష్, కోశాధికారి డాక్టర్ ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, పరిసరాల గ్రామీణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దివ్యాంగ విద్యార్థులు ఉపకణాల గుర్తింపు శిబిరం ఈనెల 17న నల్లగొండలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలలోపు విద్యార్థులు చలన వైకల్యం, వినికిడి లోపం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

బంజారా భాషను రాజ్యాంగంలో చేర్చాలి

భువనగిరి : బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ కోరారు. శుక్రవారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 14 కోట్ల మంది బంజారా భాష గోలి హోరి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అలాగే తండాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి గిరిజన రిజర్వేషన్లు 12 శాతం పెంచడంకోసం ప్రజాప్రతినిధులతో కూడిన గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

● వరలక్ష్మీ వ్రతాలు





నల్లగొండలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఏ పంట.. ఎంత విస్తీర్ణం

సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఈఓలు

- క్షేత్ర స్థాయిలో పర్యటించి సేకరణ
- ఇప్పటి వరకు 64 శాతానికిపైగా నమోదు
- నెలాఖరు వరకు పూర్తికానున్న ప్రక్రియ

నల్లగొండ టౌన్: పంటల సాగు లెక్క పక్కాగా ఉండేందుకు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ సేకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెలాఖరులోగా పంటల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. దీంట్లోభాగంగా వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, పట్టాదార్ పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌తోపాటు ఏయే పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో తెలుసుకుని ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంటల నమోదు కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా పక్కాగా నమోదు చేస్తున్నారు. దీంతో జిల్లాలో రైతులు ఏయే పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న సమాచారం పక్కాగా తేలనుంది.



నల్లగొండ మండలం అన్నెపర్తిలో పత్తిపంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

నెలాఖరు వరకు నమోదు పూర్తి



జిల్లా వ్యాప్తంగా ఈనెలాఖరు వరకు వరినాట్లు వేసుకునే అవకాశం ఉంది. పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఇప్పటికే 70 శాతం వరకు పంటల నమోదు పూర్తికావొచ్చింది. ఈ నెల చివరి నాటికి పత్తి, వరి సాగు వివరాల నమోదు పూర్తి చేస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

సాగు అంచనా 11.40 లక్షల ఎకరాలు

ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 11.40 లక్షల ఎకరాల్లో పత్తి, వరి, ఇతర పంటలను రైతులు సాగుచేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. సీజన్ ఆరంభంలో కొంత మేరకు వర్షాలు కురిసినప్పటికీ తిరిగి జూలై మాసంలో వర్షాలు పడకపోవడంతో జిల్లా వ్యాప్తంగా పత్తిసాగు మినహా వరిసాగు గణనీయంగా తగ్గింది. ఇప్పటి వరకు పత్తి 4,91,848 ఎకరాల్లో సాగు కాగా ఇందులో వరి కేవలం 50 వేల ఎకరాల్లోనే నాట్లు వేశారు. సుమారు 2.50లక్షల ఎకరాలకు సరిపడా రైతులు వరినార్లు సిద్ధ చేసుకుని ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, ఆయకట్టు సాగుకు నీరు విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో వరినాట్లు ఊపందుకునే అవకాశం ఉంది. ఈనెలాఖరు వరకు వరినాట్లు వేసుకునే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.



3.15 లక్షల ఎకరాల్లో వివరాల సేకరణ

జిల్లాలో వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇప్పటి వరకు 3,15,434 ఎకరాల్లో సాగు చేసిన పత్తి, వరి, ఇతర పంటల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. దీంతో 64.13 శాతం వరకు ఆన్‌లైన్‌లో పంటల నమోదు పూర్తిచేశారు.

మండలాల వారీగా పంటల నమోదు (ఎకరాల్లో..)

మండలం	సాగైన విస్తీర్ణం	పంటల నమోదు
అనుముల	10,096	5,371
గుర్రంపోడు	36,190	23,371
నిడమనూరు	2,510	2,515
పెద్దవూర	15,710	9,634
తిరుమలగిరిసాగర్	16,470	9,593
త్రిపురారం	80	65
చందంపేట	22,402	7360
చింతపల్లి	39,389	23,375
దేవరకొండ	29,200	15,092
గుండ్లపల్లి	8,145	4,998
కొండమల్లేపల్లి	10,180	4,593
నేరడుగొమ్ము	11,700	5,472
పీఏపల్లి	14,780	12,419
అడవిదేవులపల్లి	5,975	3,293
దామరచర్ల	4,192	2,747
మాడ్గులపల్లి	8,630	6,344
మిర్యాలగూడ	01	01
వేములపల్లి	875	624
చండూరు	35,270	24,300
మర్రిగూడ	25,780	17,598
మునుగోడు	37,320	25,835
నాంపల్లి	43,390	25,427
చిట్యాల	22,739	19,317
కట్టంగూర్	9,410	6,457
కేతేపల్లి	6,466	5,294
నకిరేకల్	5,980	5194
నార్కట్‌పల్లి	21,564	15,752
శాలిగౌరారం	22,628	17,312
కనగల్	5,201	3,556
నల్లగొండ	14,788	8,044
తిప్పర్తి	4,787	4,481

‘రుణమాఫీ’ నోడల్ అధికారుల నియామకం

నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం మూడు దఫాల్లో చేసిన రుణమాఫీ కొందరు రైతులకు అందలేదు. దీనిపై జిల్లా వ్యాప్తంగా 12,966 మంది రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు విడతల్లో మాఫీ కాని రైతుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు మండల వ్యవసాయ అధికారిని నోడల్ అధికారిగా గుర్తిస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. వీరికి రెండు మూడు రోజుల్లో రుణమాఫీకి సంబంధించిన లాగిన్ ఇవ్వనున్నారు. రుణమాఫీ కాని రైతులు ఆధార్ నంబర్ తప్పులను సరిచేయడం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లో పేరు వేరేగా ఉండడం తదితర టెక్నికల్ సమస్యలను నోడల్ అధికారులు సరిచేయనున్నారు. రుణమాఫీ కాని రైతులంతా సంబంధిత మండల వ్యవసాయ అధికారిని(నోడల్ అధికారిని) సంప్రదించి తప్పొప్పులను సరిచేసుకొని రుణమాఫీ పొందాలని డీఏఓ పాల్వాయి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

రుణమాఫీ డబ్బులు నేటి నుంచి జమ..

జిల్లాలో మూడో విడత రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ అయిన రైతుల జాబితా శుక్రవారం సాయంత్రానికి జిల్లాకు చేరింది. జిల్లా వ్యాప్తంగా 36,498 మంది రైతుల ఖాతాల్లో రూ.455.026 కోట్లు జమకానున్నాయి. మాఫీ వర్తించే రైతుల ఖాతాల్లో నేటి నుంచి డబ్బులు జమ కానున్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

ఎలిశా పరీక్ష ద్వారా వ్యాధుల నిర్ధారణ

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్ : జిల్లాలో డెంగీ, చికున్ గున్యా కేసులు ఎక్కువగా వస్తున్నాయని ర్యాపిడ్ టెస్ట్‌ల ద్వారా వచ్చిన కేసులను, ఎలిశా టెస్ట్ ద్వారా నిర్ధారించుకోవాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ పాజిటీవ్ వచ్చిన వ్యక్తి పరిస్థితిని బట్టి ఆస్పత్రిలో చేర్చుకోవాలని సూచించారు. రోగి యొక్క కేస్ షీట్‌లో పూర్తి వివరాలను నమోదు చేయాలని.. ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రోగి ఆర్థిక పరిస్థితి బట్టి ఫీజు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆస్పత్రి నిర్వాహకుడు డెంగీ, చికున్ గున్యా కేసుల వివరాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు వారి పరిధికి మించి వైద్యం చేస్తే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి క్లినిక్‌ల ముందు ప్రథమ చికిత్స కేంద్రం బోర్డు పెట్టాలని, పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేసేందుకు కృషి చేయాలన్నారు. హాస్పిటల్ సర్వీస్‌లపై కలెక్టరేట్‌లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

నల్లగొండ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి జాగ్రత్తగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై మండలస్థాయి బృందాను శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన బృందాలు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ మురళి, డీటీసీపీ లక్ష్మీనారాయణ, డీఎల్‌పీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎంపీఓలు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ కుటుంబ పాలనలో మహిళలకు మంత్రి పదవులు దక్కలేదని, మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేటీఆర్ మహిళలపై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు గాలి నాగరాజు, నాంపల్లి భాగ్య, నాగమణిరెడ్డి, పిల్లి యాదగిరి, పుట్టా రాకేష్, మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, జంజీరాల గిరి, పెరిక అంజయ్య, వడ్డేపల్లి కాశిరాం, రాకేష్, రంజిత్, ముజ్జు, సల్మాన్, సిద్ధార్థ, వడ్డేపల్లి మహాలక్ష్మి, నందిని, ఎల్లోరా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గళమెత్తిన జూనియర్ డాక్టర్లు




ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌లు

నల్లగొండ టౌన్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ వైద్యులపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు. హత్యకు గురైన డాక్టర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

‘మహిళా శక్తి’కి అడుగులు

- లబ్ధిదారుల ఎంపికలో ‘మెప్మా’ నిమగ్నం
- 69 సామూహిక, 399 వ్యక్తిగత యూనిట్ల ఏర్పాటుకు రుణ సహాయం
- ఈ ఏడాదిలోనే ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేసిన యంత్రాంగం

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఇందిరా మహిళా శక్తి పేరుతో త్వరలో కొత్త పథకం అమలు చేయాలని ఇటీవల సీఎం ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపల్ శాఖ ఈ పథకం అమలు బాధ్యతలను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)కు అప్పగించడగా కార్యాచరణ ప్రారంభించింది. ఆ సంస్థ అధికారులు మున్సిపాలిటీల్లో అర్హత కలిగిన సంఘాల్లో లబ్ధిదారులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పథకం కింద జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, హాలియా, చిట్యాల, నందికొండ, నకిరేకల్, చండూరు, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో స్వయం సహాయ సంఘాల మహిళలకు సామూహికంగా, వ్యక్తిగతంగా రెండు రకాల రుణాలు అందజేసి స్వయం ఉపాధి కల్పిస్తారు. ఆయా మున్సిపాలిటీల్లో 399 వ్యక్తిగత యూనిట్లకు రూ.13.97కోట్లు, సామూహికంగా చేపట్టే 69 స్వయం స్వయం ఉపాధి యూనిట్లకు రూ.13.80 కోట్ల నిధులు కేటాయించారు. ఈ రుణాలను శ్రీనిధి లేదా బ్యాంకు లింకేజీల ద్వారా అందించనున్నారు.



రుణ యూనిట్ల కేటాయింపు ఇలా..

మున్సిపాలిటీ	సామూహిక	వ్యక్తిగత
మిర్యాలగూడ	23	120
నల్లగొండ	25	144
హాలియా	04	24
నందికొండ	01	15
నకిరేకల్	06	34
చండూరు	03	18
చిట్యాల	02	16
దేవరకొండ	05	28

సంఘాలను గుర్తిస్తున్నాం

జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో ఇందిర మహిళా శక్తి పథకం కింద 69 వరకు గ్రూఫ్ ఎంటర్ ప్రైజెస్ యూనిట్ల కింద రూ.13.80 కోట్లు, వ్యక్తిగత రుణాలను కింద 399 సంఘాలకు రూ.13.97 కోట్లు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఆసక్తి గల మహిళా సంఘాలను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేంత వరకు పూర్తి స్థాయిలో రుణాలు అందిస్తాం.

– కరుణాకర్, మెప్మా పీడీ, నల్లగొండ

సామూహిక యూనిట్ల కింద..

ఈ పథకంలో భాగంగా సామూహిక యూనిట్ల కింద జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో ఇందిరా మహిళా శక్తి గ్రూఫ్ ఎంటర్ ప్రైజెస్ కింద ఈ–క్యాంటీన్ల ఏర్పాటుకు ఒక్కొక్క మహిళా సంఘానికి రూ.20లక్షల చొప్పున మొత్తం 69 స్వయం సహాయక సంఘాలకు రూ.13.80 కోట్ల రుణాలు ఇవ్వనున్నారు. వీటితో గృహసేవిక (ఏజెన్సీ), ఈవెంట్ మేనేజిమెంట్, నిర్మాణ రంగ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్, క్యాటరింగ్, కోల్డ్ స్టోరేజ్, మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో ముందుగా సందర్శకులు అధికంగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు, లాభసాటిగా ఉండే ప్రదేశాల్లో ఒక్కో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటుకు మెప్మా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వ్యక్తిగత రుణాలు..

జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో వ్యక్తిగత రుణాల కింద ఒక్కో యూనిట్‌కు రూ.3.50లక్షలు చొప్పున 399 స్వయం సహాయక సంఘాలకు వ్యక్తిగత రుణాల కింద మొత్తం రూ.13.97 కోట్లు ఇవ్వనున్నారు. ఈ రుణాలతో కూరగాయల విక్రయం, బేకరి, కర్రీ పాయింట్, టీ స్టాల్, మిల్క్ సెంటర్, పాడిగేదెల ఫాం, మైకిసెట్, టెంట్ హౌస్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణం, శారీ స్టోర్, బ్యూటీపార్లర్, ఆహార ఉత్పత్తుల వంటివి యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

పోరాటాలతోనే పూర్వ వైభవం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆలేరురూరల్ : ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై నిరంతర పోరాటాలు చేయడం ద్వారానే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆలేరులో చెక్క వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా సమితి కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందవ వసంతంలోకి అడుగిడనున్న నేపథ్యంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, రైతుభరోసా, పేదలకు ఇళ్లు, ఆసరా పించన్లు తదితర సమస్యలపై పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆలేరు ప్రాంతం నుంచి ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి పేదప్రజల పక్షాన చిరస్మరణీయ పోరాటం సాగించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి దేశ సమగ్రతను కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, విద్యార్థి, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

క్లుప్తంగా

రెండు కిలోల గంజాయి పట్టివేత

రామన్నపేట: భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని శుక్రవారం యాదాద్రి జిల్లా టాస్క్ ఫోర్స్, రామన్నపేట ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వైపు కారులో గంజాయిని తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఇల్లందు, ఖమ్మం, తుంగతుర్తి, నకిరేకల్ సెంటర్ల నుంచి యాదాద్రి జిల్లాలోకి ప్రవేశించినట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు పలు మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట వద్ద కారును అదుపులోకి తీసుకొని తనిఖీలు నిర్వహించగా రెండు కిలోల గంజాయి పట్టుబడింది. కారుతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నట్లు తెలిసింది. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ, ఎక్సైజ్ సీఐ బాలోజీనాయక్, ఎస్‌ఐ శంకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన రాందాస్

చిట్యాల : పట్టణంలోని జాతీయ రహదారిపై పోలీస్ స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన రాందాస్ మోటర్‌సైకిల్‌పై పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాందాస్ రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు వెంటనే రాందాస్‌ను వైద్య చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చిలుకూరుకు చెందిన దాసోజు బ్రహ్మాచారి నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సరితను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులుగా సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్‌లో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తుండగా ఈ నెల 14న బ్రహ్మాచారి భార్యతో ఘర్షణ పడి ఆమె మెడకు దండెం వైరుతో బలంగా లాగి హత్య చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

నడిగూడెం: మండల పరిధిలోని చెన్నకేశ్వాపురానికి చెందిన సంకోజు భద్రమ్మ శుక్రవారం తన ఇంటి ముందు నిలబడి ఉండగా ఆమెపై కోతులు దాడి చేసాయి. దీంతో ఆమె ఎడమ చేతికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి కోతులను అటవీ ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

రామన్నపేట: మండలంలోని బోగారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం రామన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈమేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లతోపాటు రూ. 6,880నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా సాక్షి నిర్వహించిన 'వరలక్ష్మి సెల్ఫీలకు ఆహ్వానం'కు విశేష స్పందన లభించింది. వరలక్ష్మి పూజలో కూర్చున్న మహిళలు సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని ఇవీ..


భారతి, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ


ప్రమీల, శాంతినగర్, నల్లగొండ


ఎర్ర వసంత శ్రీనగర్ కాలనీ, నల్లగొండ


గురులక్ష్మి, వివేకానందనగర్ కాలనీ, నల్లగొండ


మౌనిక, మోత్కూర్


అలుగుబెల్లి దివ్య కంచర్ల టవర్స్, నల్లగొండ


బి. స్వాతి హుజూర్ నగర్


చిదిరాల సక్కుబాయి, బొడ్రాయిబజార్, కోదాడ


ఎనిగే రాణి, అంజనాపురి కాలనీ, సూర్యాపేట


కె. అలేఖ్య హుజూర్ నగర్


మాధవి, వెల్లంకి


కోల పద్మావతి, హుజూర్‌నగర్


ఎస్. విజయలక్ష్మి హుజూర్‌నగర్


పావని, యాద గిరిగుట్ట


సామ కృష్ణవేణి, కృష్ణానగర్ కాలనీ, సూర్యాపేట


కాలేరు అర్చన, భువనగిరి


కాలేరు స్వప్న, భువనగిరి

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్ట్

- 50 ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5.20లక్షల విలువ చేసే మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈనెల 12న నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో ఇడ్లీ బండి నడుపుకుంటున్న కోల సైదులు తన వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో నంబర్ ప్లేట్ లేని కారు అతడి ఇడ్లీ బండి ముందు ఆపారు. కారులో నుంచి నలుగురు వ్యక్తులు బయటకు వచ్చి సైదులును బెదిరించి మొబైల్ ఫోన్, రూ.2200 నగదు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో సైదులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపికృష్ణ, లచ్చిరెడ్డి తన సిబ్బందితో మూడు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. శుక్రవారం నకిరేకల్ శివారులో బాబాసాహెబ్‌గూడెం స్టేజీ వద్ద సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ వాహనాలు తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేని కారు అనుమానాస్పదంగా కనిపించడంతో దానిని ఆపారు. అందులో ఉన్న ఆరుగురిని తనిఖీ చేయగా.. వారి వద్ద 50 ఫోన్లు ఉన్నాయి. వారిని విచారించగా సెల్ ఫోన్ చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరిది ఏపీలో నంద్యాల జిల్లా డోన్ ప్రాంతవాసులుగా గుర్తించారు. నిందితుల్లో నంద్యాల జిల్లా డోన్ మండలం చిగురుమన్నపేటకు చెందిన యరుకుల కవాడి దుర్గ ప్రసాద్, నాగునూరి రవికుమార్, కవాడి ప్రభాస్, బండి వెంకటేష్‌తో మరో ఇద్దరు బాలలు ఉన్నారు. చోరీ చేసిన ఫోన్లు హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని, నకిరేకల్‌లో ఈనెల 12 కోల సైదులు ఫోన్, నగదు చోరీ చేసింది కూడా వారేనని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ, ఏఎస్‌ఐ కృష్ణాచారి, సిబ్బంది వెంకటేశ్వర్లు, ముదకర్, సురేష్, జనార్దన్‌లను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి


నాగారంబంగ్లా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సోమనర్సయ్య

నాగారం: సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి నాగారంబంగ్లా శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన వేల్పుల సోమనర్సయ్య(48) నాగారం మండలానికి చెందిన బీసీ గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం సూర్యాపేటలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తొండలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి సూర్యాపేటకు వెళ్తున్న క్రమంలో నాగారంబంగ్లా సమీపంలోని విజయనగర్ కాలనీ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘనటలో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. కాగా మృతుడు గతంలో నాగారం మండలంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహించాడు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతలపాలెం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన షేక్ మీరాసా (32) మండలంలోని దొండపాడులో మోటార్ సైకిల్‌ను కొనేందుకు గురువారం తన స్నేహితుడు వీరబాబుతో కలిసి మరో బైక్‌పై వచ్చారు. పులిచింతల ప్రాజెక్టు చూసి సాయంత్రం తిరిగి కోదాడ వెళ్తున్న క్రమంలో దొండపాడు శివారులోని మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు కిందపడి మీరాసాకు తలకు బలమైన గాయం కాగా.. వీరబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని అంబులెన్స్‌లో జగ్గయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మీరాను ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతడి తండ్రి రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విచారణ


రావులపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ రవి

తుంగతుర్తి: మండల పరిధిలోని రావులపల్లిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై శుక్రవారం సూర్యాపేట డీఎస్పీ రవి విచారణ చేపట్టారు. మానాపురం గ్రామానికి చెందిన లకావత్ సురేష్ గత నాలుగు సంవత్సరాలుగా రావులపల్లి శివారులోని విజయ్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆ భూమిని విజయ్‌కుమార్‌కు అమ్మిన వ్యక్తులైన గట్టు సోమయ్య, గట్టు శ్రీకాంత్‌లు ఈ నెల 4న లకావత్ సురేష్ కౌలుకు చేస్తున్న భూమిలోకి ప్రవేశించి కులం పేరుతో దూషించడంతో పాటు సాగు చేసిన పత్తి పంట ధ్వంసం చేశారు. ఈమేరకు సురేష్ తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశామని, విచారణ చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎస్‌ఐ ఏడుకొండలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వివాహిత అదృశ్యం

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణానికి చెందిన ఓ మహిళ గురువారం అదృశ్యమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన దంపతులు గత కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం చౌటుప్పల్‌కు వచ్చారు. వీరికి మూడేళ్ల క్రితం వివాహమైంది. భర్త స్థానికంగా పరిశ్రమలో పని చేస్తుండగా భార్య ఇంటివద్దే ఉంటుంది. గురువారం ఉదయం భర్త కంపెనీకి వెళ్లాడు. భార్య మధ్యాహ్నం సమయంలో ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త ఆమె ఆచూకీ కోసం ప్రయత్నాలు చేసినా కనిపించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మూసీనదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో గల మూసీ నదిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి 60 ఏళ్ల వయసు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై గ్రే కలర్ టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంట్, మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 8712670180కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం

నకిరేకల్ : నకిరేకల్ మండలం చందంపల్లి స్టేజీ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి తెలిపిన వివరాలు ప్రకారం.. భువనగిరి మండలం లంపానాయక్ తండాకు చెందిన దీరావత్ మధు, రాంబాబు ట్రాలీ వాహనంలో సూర్యాపేట జిల్లా అర్వపల్లి నుంచి హైదరాబాద్‌కు 29క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. మార్గమధ్యంలో నకిరేకల్ మండలం చందంపల్లి స్టేజీ వద్ద హైవేపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరిని పట్టుకున్నారు. ఈమేరకు వారిపై ఎస్‌ఐ లచ్చిరెడ్డి కేసు నమోదు చేసి సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం ,శ్రీస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం జరిపారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగించి ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు ,శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలో 'ఏఎమ్మార్పీ' భూములు

- కాల్వల వెంట కబ్జాకు పాల్పడుతున్న సమీప రైతులు
- దారి కోసం రైతుల మధ్య ఘర్షణ
- పట్టించుకోని సంబంధిత అధికారులు


చామలోనిబావి గ్రామపరిధిలో డి-23 మేజర్‌లో ఒక్కవైపు మాత్రమే ఉన్న రోడ్డు

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ కాల్వల వెంట గల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో కాల్వ వెంట కింది భాగంలోని రైతులకు దారి లేకుండా పోవడంతో రైతుల మధ్య ఘర్షణలకు దారితీస్తుంది. కాల్వల వెంట భూములు గల రైతులు కాల్వ అంచు వరకు కబ్జా చేసి దున్నుకుని తమ భూమిలో కలిపేసుకుంటున్నారు. ప్రధాన కాల్వ వెంట ఉన్న పెద్ద మట్టి కట్టలను కూడా తొలగించి ఆక్రమించినవి అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. కాల్వలను తవ్వినప్పుడు భూసేకరణ జరిపిన రైతు రికార్డుల నుంచి తొలగించకపోవడంతో కొంతమంది రైతులు తమ భూములను విక్రయాలు కూడా చేస్తున్నారు. మూడేళ్ల క్రితం రెవెన్యూ రికార్డుల నుంచి భూసేకరణ జరిపిన భూములను తొలగింపు చేపట్టినా అరకొరగా జరిపి వదిలేశారు.

300ఎకరాల ఏఎమ్మార్పీ భూమి కబ్జాలోనే..

గుర్రంపోడు ఏఎమ్మార్పీ డివిజన్ పరిధిలో డి-16 నుంచి డి-26వరకు 35కిలోమీటర్ల ప్రధాన కాల్వ, 250కిలోమీటర్ల మేజర్, మైనర్ కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వకు ఇరువైపులా వంద ఫీట్లు, మేజర్, మైనర్ కాల్వల వెంట ఎడుమవైపు 27ఫీట్లు, కుడివైపు 15ఫీట్ల ఖాళీ స్థలాన్ని రహదారుల కోసం అధికారులు కేటాయించారు. ఇన్‌స్పెక్షన్ పాత్‌లుగా ఇవి కాల్వల వెంట అధికారుల పర్యవేక్షణకు, రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రహదారులుగా ఉపయోగపడాల్సి ఉంది. డీప్ కటింగ్ జరిగిన చోట మట్టిని పోసేందుకు కాల్వ పక్కన ఎక్కువ భూభాగం సేకరణ జరిగినా ఇప్పుడు మట్టి తరలింపు జరిగి భూమి ఆక్రమణల పాలైంది. గుర్రంపోడు డివిజన్ పరిధిలో 2300ఎకరాల్లో కాలువల కోసం భూసేకరణ జరిగినట్లు రికార్డుల్లో ఉన్నా 300ఎకరాల ఆక్రమణల పాలైనట్లు తెలుస్తుంది.

దారి కోసం తంటాలు.. రైతుల మధ్య ఘర్షణలు

కాల్వల వెంట ఇరువైపులా దగ్గరగా ఆక్రమణలకు పాల్పడడంతో చాలా చోట్ల రోడ్డే లేకుండా పోయి సరకు రవాణాకు రైతుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. తమకు దారి ఇవ్వడం లేదంటూ కాల్వ వెంట కింద వరకు వెళ్లే పలువురు రైతులు ఏఎమ్మార్పీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతంలో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయవత్తిళ్లతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. తమకు జ్యుడీషయల్ అధికారులు ఇస్తేనే కాల్వల వెంట ప్రభుత్వ ఆస్తులను కాపాడగలమని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏఎమ్మార్పీ కాల్వల రహదారులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.


నడికూడలో ఆక్రమణకు గురైన డి- 22 పరిధిలోని మైనర్‌కాల్వ

హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి



కాల్వలకు ఇరువైపులా దారి లేకుండా దున్నుకుంటున్నా అధికారులు చోద్యంగా చూస్తున్నారు. డి- 22కాల్వలో నడికూడ గ్రామపరిధిలో దారి లేకుండా కనీసం నడిచి వెళ్లలేనంతగా ఆక్రమణలకు గురవుతున్నా పట్టింపులేదు. కాల్వదారులను నిర్దేశించిన మేరకు హద్దురాళ్లను ఏర్పాటు చేయాలి. ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– వద్దగోని గంగాధర్‌గౌడ్, రైతు, నడికూడ

భూములు స్వాధీనం చేసుకుంటాం



కాల్వల వెంట గల భూములను రైతులు తాత్కాలికంగా ఆక్రమణలోకి తీసుకున్నా తమది కాని భూమి విషయంలో ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాల్వల వెంట గల ఆక్రమణల భూములు రిజిస్ట్రేషన్‌లు జరిగినా రద్దు చేసి స్వాధీనం చేసుకుంటాం. సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆక్రమణలపై ఫిర్యాదు అందిన చోట్ల చర్యలు తీసుకుంటున్నాం.

– ఆనందరావు, గుర్రంపోడు డివిజన్ ఈఈ

వడదెబ్బతో మహిళ మృతి

నాగారం: వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం నాగారం మండలంలోని వర్ధమానుకోటలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఉడుతల యాదమ్మ(60) రోజుమాదిరిగా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లింది. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వేడిమి తాళలేక అస్వస్థతకు గురైంది. గుండెలో నొప్పి వస్తోందని చెప్పడంతో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ తలుపులు ధ్వంసం



చందంపేట : మండలంలోని చిత్రియాల గుట్టపైన గల రేణుక ఎల్ల మ్మ ఆలయ తలుపులను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయ తలుపులను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు.